# అర్ధంగాని మార్పు

త్రగూలు రావటానికి వీల్లేదు, 'ఇంటా - బయటా' కూడా. ఎందు వల్లనంటే, యింటి కెదురుగ్గా ప్లీడరుగారు, ప్రక్కింటివాటాలో పోలీసాయన. ఇవన్నీ ఆలోచించే యిల్లు మారటం జరిగింది. ఇదివరకు మేమున్న యింట్లో హోరాహోరిని అస్తమానం మొగుడు పెళ్ళాలమధ్య కీచులాటలు జరుగుతూండేవి.

ఏమీలేదు. ఆయన అవునన్న దావిడ 'కాదు' అంటుంది. ఆవిడ కాదన్నదాన్ని, ఒకప్పుడు గాకపోతే ఒకప్పుడన్నా, మొగముండావాడు కాబట్టి అవుననవలసి వచ్చేది ఆయన.

దాంతో ఆ యింట్లో కొంపలంటుకు పోయేవి. భోజనాలదగ్గర— పనివేళా రెట్టిస్తూ,

"నేనడిగింది నువ్వేశావు కా"వంటాడు అతను.

"నేను వేసింది మీరు తిన"రంటూం దామె.

"నేనడిగింది నువ్వెందు కెయ్యవే భామా!" అని తలకాయాడిస్తాడు ఆ పెద్దమనిషి.

ఆ చిన్నమనిషి-"నేను వేసింది మీ రెందుకు తినరండీ?" అని నడ్డిమీద చెయ్యి ఆన్చి అంటుంది.

"నా రుచి నాది - నీ రుచి నీది" అంటాడతను.

"మీ రుచి నాకు తెలీదా?" అని వెక్కిరిస్తుంది.

అతను కంచం కదపడు. ముద్ద కలిపి నోటికెత్తడు. కాస్సేపు కంచంలో నిండుకుని వున్నటువంటి భక్ష్యాలను పర్యావలోకన చేసి చూపుడు వేలాడిస్తూ-'ఈ పచ్చడి నీ కిష్టమనుకుంటాను.' అంటే ఆమె 'మీకీ పచ్చడి

మొహం తెలుస్తేగా - తినకుండా వంకలెన్నితే ఎట్లా ?' అని చేతి మెటికలు విరుస్తుంది.

"నా కిష్టమైనది నీ కెప్పుడైనా చేశావు గనుకనా"

ఈ ప్రశ్న కావిడదగ్గర సీలువేసిన అన్సరు సిద్ధంగా వుంటుంది. తడుముకోకుండా - "మొన్న వంకాయబజ్జీ పచ్చడంతా కాజేసిందెవరో?" అంటే- 'ఎలక-పిల్లులకి' అంటూ అతను అన్నదానికి 'సిగ్గు లేకపోతేసరి మొహానికి. వేయించుకుని తిని నువ్వేం చేశావని అడగటానికి? ఇంకా ఇటువంటి విశ్వాసఘాతపు కూతలు కుయ్యటానికి?' అని ఎదురు కొట్టేస్తుంది.

దీన్తో నిప్పు రాజుకుంటుంది తిన్నగా. వంశాలమీదకు పేరుపేరు వరుసగా అక్షతలు జల్లటంతో యుద్ధకాండ ప్రారంభమయ్యేది.

"త్వం శుంఠ" అంటే "త్వం శుంఠ"వరకూ సంగరం హాంగుగా సాగేది.

పర్యవసానం—ఆ యింతి గొంతుక బొంగురెత్తేలా వంశక్రమాన్నను సరించి తిట్లు చెరగడం, చెరగ్గా చెరగ్గా ఆ మగప్రాణికి వేడిపుట్టి ప్రాణం విసిగి చెయ్యిజేసుకోవటం, అర్ధరాత్రప్పుడు ప్రక్కవాటాలో కాపురమున్న మర్యాదస్థులకు గుద్దులు వినిపించడం, ఆపిమ్మట సన్నటిమూలుగు, కొంచెం సేపటికి చెప్పులజోళ్ళ చప్పుడు, తరువాత తలుపు ఫడీల్మంటూండగా ఆ రమణీలలామ ముద్దులకు సుద్దులకు తప్ప 'గుద్దుల కింతులోర్తురె! కృపారహితాత్మక' అని తిట్టుకుంటూండగా పొరుగువాళ్ళకు 'రాకానిశారాజశ్రీసఖమైన మోమున బటాగ్రం బొత్తి యొత్తి యా రాజీవానన యేడ్చె' నిన్నరాత్రి అని తెల్లవారాక చెప్పుకోవలసివచ్చేది.

ఇవన్నీ పడలేక యిల్లు మార్చేశాను. ఇంకో భయమేమిటంటే సహవాసదోషంవలన మేముకూడా కొద్దో గొప్పో తగూలాడుకోవటానికి అలవాటుపడ్డామనే చెప్పాలి.

ఈ అనర్థాలన్నీ యింటిపొరుగు మంచిది కాకపోవటం మూలాన. ఇప్పుడాభయం లేదు. ఐనా అనుమానం పీకుతూనేవుంది.

ఓ మూడురోజులవరకు అక్కడ సామానిక్కడ, యిక్కడ సామానక్కడ సర్దటంతో జరిగిపోయింది కాని ఎందులోనూ మచ్చుకొకరి కొక్క చిన్న పేచీగాని, వాగ్వాదంగాని వచ్చివుండలేదని సంతోషిస్తూనే వున్నా.

ఈ తగూలు తంపులు లేకుండా ఏ మొగుడూ ఏ పెళ్ళాంతోనూ కాపురం చేసివుండడు. ఐతే ఒకప్పుడు చెయ్యటానికవకాశముంది. అందులో ఒకరు మూగీ, రెండవవాళ్ళు చెముడూ అయినప్పుడు. ఐతే నవ్యులు, పూర్వకులూకూడా ప్రణయంయొక్క క్లైమాక్స్ కలహంలో వుందని వప్పుకోవటం వలన—సుమతీ శతకకారుడుగూడా 'తలయంటిన నాటినిద్ర, ప్రణయ కలహంనాటిరాత్రి' అంటూ కుర్రవాళ్ళకు నీతులు చెప్పటంలో వప్పుకోవటం వలన-తేలేదేమంటే ఆటలాడి ఆటలాడి అలిసిన తరువాత ఆ ఆకలికి గడ్డి పెట్టినా పరమాన్న మనుకొన్నట్లుగా మనుష్యులు ఆలితో కలహించి పీతత్కలహాంతమందు మోహం వాచినట్లు గడిపి ఆ అనుభవాన్ని గొప్పదిగా పోల్చి చెప్పుకున్నారేమో అని.

ఐతే నా మట్టుకి నాకు పుస్తకాలు, అడ్డమైనవాళ్ళ అభిప్రాయాలు ఆధారంగా చేసుకోవలసిన అవుసరంలేదు. ఒకప్పుడు దుర్గే నాకు పదిమంది మేనకలు, పావుడజను శూర్పణఖల పెట్టు అనిపిస్తుంది.

దుర్గతో చాలామాట్లు కలహించాను. దుర్గ నాతో కలహించింది. ఐనప్పటికీ ఏది ప్రణయకలహమో, ఏది మామూలు కలహమో, తెలుసుకోవటానికి నామట్టుకు నాకు దుర్గమంగానే వుంది, అప్పటికీ యిప్పటికీ.

ఈ లోపుగా ఒక రికార్డు తయారుచేశాను. అందులో వరుసగా తేదీవారీని తగూలను చిట్టాలో కెక్కిస్తూవచ్చాను. ఐనప్పటికీ ఏది ప్రణయ కలహమనాలో ఆ సైనం తెలిసిరాలేదు. ఈ లోపుగా యిల్లు మారాం.

౨

దొడ్లో జామిచెట్టు. ఆ పక్కన శుభ్రంగా నుయ్యి. నూతిలో కొబ్బరి బొండాల్ని మించిన రుచిగల ధార. స్నానాలగది. ప్రత్యేకంగా వంటకు భోజనాలకు పెద్దగది. నూతిదగ్గరంతా గచ్చుమయం; రవ్వంత యిసకకూడా కాలి కంటదు. విద్యుద్దీపాలు. అంతగా కావలిస్తే ఓ రెండుబిందెలనీళ్లు తెచ్చుకోవచ్చు త్రాగటానికి. వీధిలో ఎదురుగుండా పంపు.

ఈ యిల్లు చూడగానే దుర్గమొహం గంపంతై కూర్చుంది.

దొడ్లో వంటిల్లు గాకుండా వరసాగ్గా మూడుగదులు - గదికి మూడు కిటికీలు, ఒక అలమారచొప్పున వుండగా యిన్ని హంగుల్తో ముప్పైరూపాయల అద్దెకు ఇంత ఇల్లు వస్తూండగా దుర్గ సుఖపడటంలో ఆశ్చర్యమేమిటి? సుఖపడగలదని నేను నమ్మాను. ఏ మొగుడు ఏ పెళ్ళాన్ని ఇంతకన్నా సుఖపెట్టగలడు ? ఈ గర్వం నాలో క్రొత్తగా ప్రవేశించింది—దాంపత్యమంటే భార్యాభర్తలొకరొక్కరికి ఎంత వీలైతే అంతగా సుఖపెట్టుకోవటమనే తాత్పర్యంతో. ఆ యింట్లోంచి సామాను కదిల్చి యిక్కడకు తేవటం-ఆ సర్దుడంతా సణిగి యిల్లు మామూలుధోరణికి రావటానికి వారంరోజులు తీసుకుంది.

ఇంట్లో వున్నంతసేపూ ఆవిడగారు తనుచేసే ప్రతిపనికీ నా సలహా తీసుకుంటూనే వుంటుంది.

ఒకమాటు-'పొయ్యి ఎక్కడ వెయ్యమంటా'రని అడగవచ్చింది.

ఏదో చెప్పి పంపాను.

"నాకు కుర్చీపీట ఎక్కితే కళ్లు తిరుగుతాయి. కాస్త వుట్టి కొట్టి పెట్టమంది. తను మేకూ రాయీ అందిస్తే వెళ్ళి ఆ వుట్టి కాస్తా కట్టాను. అంతలోనే నేను తలకు నూనె రాసుకుంటూ వుండగా వచ్చి - "కొంచెం బొగ్గులబస్తా సాయంపట్టండి- నేనొక్కర్తినీ మొయ్యలేను" అంది.

నేను చెయ్యనంటే "యిదంతా ఎవరికోసం? ఈ సంసారం నావక్కరిదేనా" అంటుందని వెళ్ళి వొళ్ళంతా మసిచేసుకున్నాను.

స్నానం పూర్తయ్యేసరికి నా నలుపు సబ్బుబిళ్ళకు బట్వాడాఅయి, యింకా ఏదన్నా మిగిలివుంటే తుండుగుడ్డ నంటిపెట్టుకుపోయింది ఆ కాస్తా. ఆ వరసన నాచేత యింతా దండెం బట్టలా రేసుకుందుకనీ, గోడని రాముల వారి పటమనీ, మధ్యగదిలో రాసక్రీడ, జలవిహారం, మన పెళ్ళి ఫోటో అంటూ ఓ వరసని పనులన్నీ పురమాయించింది.

కొమ్ములు దిరిగిన మగరాయుళ్ళచేత వెట్టిచాకిరీ చేయించుకోవాలంటే అద్ది ఒక్క ఆడదాని హాస వీక్షణ కటాక్షాదులవల్లనే అవుతుంది.

తను తల దువ్వుకోలేదు. శుభ్రమైన చీరగట్టుకోలేదు. అస్తమానూ ఏదో పని అక్కడి దిక్కడ ఇక్కడి దక్కడ సర్దుతూనే ఉంది.

ముందర వంటిల్లు, సామానుగది, తరువాత పడగ్గది. ఆఖర్న నా గది సర్దుతానని ఓ ప్రణాళిక సిద్ధపరిచింది.

నే నన్నిటికీ వప్పుకోవటంచేత ఏ పేచీ రాలేదు. పూచీ వుంటే పేచీ వస్తుందిగనక. చెప్పినది శిరసావహించటమే కాని సొహంతరంగా నేను అవిడ వ్యవహారాల్లో జొరబడలేదు. ఎందువల్లనంటే 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' ఎట్నుంచి ఎటు తిరుగుతుందో ! సుకుమారమైన మనస్సులాయె ! అని ఊరుకున్నా.

## 3

ఒక వేదాంతి యీ పాట నేర్పాడు.

"ఏది ప్రళయం ఏది ప్రణయం ?"

ఏది సరసం ?

ఏది విరసం ?

ఏది రాగం ? ఏది క్రోధం ?"

తరువాత నేను మొదటి చరణం మార్చి వ్రాసుకున్నాను. 'ఏది కలహం ? ఏది ప్రణయం ?' అని. ఈ పుస్తకంలో నే మొదట్నుంచీ (అంటే కాపురం మొదట్నుంచి) తగూ నంబర్ల వన్, టూ, త్రీ, అంటూ వివరాల్తో సహా కలహాలు రికార్డు చేశాను.

ఇది నా కాన్ఫిడెన్షల్ రికార్డు. దుర్గ కివన్నీ తెలిస్తే ? పుస్తకం విరిచి నేను లేనప్పుడు పొయ్యిలో దుక్కేస్తుంది. మళ్ళీ అదో పెద్ద తగూ క్రింద మారచ్చు. ఆ వివరాలన్నీ రికార్డు చెయ్యటానికి వీల్లేకుండాపోతే పురాతన ప్రణయ శిథిల శాఖకు పరిశోధన కష్టమవుతుంది. ఇప్పుడు పురాతత్వ వస్తు పరిశోధన శాఖలకు మల్లేనే భవిష్యత్తులో పురాతన ప్రణయతత్వ పరిశోధన శాఖ లేర్పడవచ్చు. అప్పటి కీ రికార్డంతా శాసనాలమాదిరి ఉపయోగపడొచ్చు. ఈ పురాతన ప్రణయతత్వ పరిశోధనకు పాళీభాష తెలిసిన పండితులక్కర్లేదు. వాత్స్యాయనుడి కామసూత్రాలు, కామరూప విద్యలు అభ్యసించినవాళ్ళు దొరక్కపోయినప్పటికీ పది పదిహేను సెక్సు పత్రికలు

క్షుణ్ణంగా లోపలి అడ్వర్టయిజుమెంట్లతో సహా వల్లెవేసి అప్పచెప్పగలిగిన వారుంటే చాలు.

ఆ ఉద్దేశంతోనే తగూలన్నీ అనలైజు చేసుకుంటూ మన స్తత్వశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం వ్రాసుకొచ్చాను.

నే నింత గొప్పపని చేస్తున్నానని చెప్పినా మా దుర్గ నమ్మదు. చెప్పక పోవటమే మంచిదిగాని ఒకవేళ చెబితే నానా గొడవా చేస్తుంది. ఈ యిల్లు మారటం సందర్భంలో ఆ పుస్తకం పోతుందన్న భయంతో భద్రంగా సంర క్షించుకుంటూ వచ్చాను. ఎంత జాగ్రత్తగా రక్షించుకుంటూ వచ్చానంటే ఇప్పుడు నే నా పుస్తకం ఎక్కడ జాగ్రత్త చేశానో మర్చిపోయేటంతగా. ఆ పుస్తకం కనుపించకపోయేసరికి నా గుండెల్లో రాయిపడినట్లయింది. పుస్తకం పోతుందేమో అన్న విచారం కన్నా దుర్గ చూస్తుందేమోరా భగవంతుడా అన్న విచార మెక్కువైంది.

దుర్గ చాలా నెమ్మదస్తురాలు. మంచి పనితనమే కాకుండా, మెలుకువ చెపితే సులువుగా గ్రహించుకోగల తెలివి అన్నీ ఉన్నాయి. కేవలం భర్త అనే కాకుండా ఒక చదువుకున్నవాడు మరొక చదువుకున్నవాడ్ని గౌర వించినట్లుగా గౌరవించేది నన్ను.

మేం వచ్చిన వారం రోజులకు దుర్గకు ప్లీడరుగారమ్మాయి ఇందిరతో బాగా పరిచయమైంది. నేను ఆఫీసు కెళ్ళినప్పుడు దుర్గ ఇందిరతో కాలక్షేపం చేసుకునేది. ఒకరోజున నేను సాయంత్రం కాఫీకని వచ్చినప్పుడు "ఇవ్వాళ వాళ్ళ ఇందిరతో మీటింగు కెళ్తానండీ" అన్నది.

"సరే వెళ్ళ"మన్నాను.

ఇది జరిగిన తరువాత మూడు రోజులకు తను కూడా స్త్రీ సమాజంలో మెంబరయినట్లు చెప్పింది. మూడునెల్ల అనంతరం నన్ను కూడా మీటింగుకు రమ్మని పిలిచింది.

"నేను మరి ఆడదాన్ని కానుగా ?" అన్నా.

"అయ్యో ! ఈ మీటింగుకి మగవాళ్లు రావచ్చుగా" అన్నది.

"అయినా నువ్వు పిలవడ మేమిటి ? ఎవళ్ళ మొగుళ్లను వాళ్లే పిలు స్తుంటే అదెక్కడి పిలుపు. నువ్వు పిలిస్తే నేను రాను" అని తేల్చాను.

దుర్గ చాలాసేపు ఆలోచించి—

"అవును, నిజమే సుమండీ మీరన్నది" అని వాళ్ల ఇందిరను పిల్చుకొచ్చింది వెళ్ళి

ఆ అమ్మాయి "మీరు తప్పకుండా రావాలండీ" అన్నది గట్టిగా.

"అయ్యో! ఎందుకు రాను. తప్పకుండా వస్తాను" అన్నా.

ఆవాళ మధ్యాహ్నం ఇంటికి రావద్దనీ, తిన్నగా ఆఫీసు వదలగానే స్త్రీ సమాజ భవనానికి రావలసిందనీ, చెప్పి, "వస్తారుగదూ! వస్తానని ఒట్టు వెయ్యండి" అన్నది.

"అక్కడికి వచ్చి నీ పేరు చెబితే సరిపోతుందిగదూ" అన్నా.

"పొండి. మీకంతా వేళాకోళం" అన్నది దుర్గ.

"అయితే, ఇంత ఇదిగా రమ్మంటున్నావు, ఇవ్వాళ విశేషమేమిటి?" అన్నా.

"సమితి స్థాపించినరోజు. రాత్రికి నాటకంకూడా ఉంటుంది" అంది మెల్లగా. 'అహా!' అని తల ఊచాను.

౪

ఆఫీసు వదలగానే స్త్రీ సమాజాని కెళ్లాను.

నాకుమల్లే ఆహ్వానింపబడ్డ మిత్రులు కొందరక్కడ తచ్చాడుతూ ఉన్నారు.

తరువాత తెలిసింది 'టిక్కెట్లు' వున్నాయనీ, అవి కొన్నవాళ్లకే లోపలికి ప్రవేశం లభ్యమనిన్నీ.

"అరే! నాకీ సంగతి చెప్పిందికాదే దుర్గ. మరిచిపోయుంటుంది" అనుకున్నా.

చాలామంది ఆడపిల్లలూ ముత్తైదువులు ముసలమ్మలతో సహా లోపలికి జొరబడ్తున్నారు. ఈ బయటి మాకీ అఘోరింపేమిటో అనుకుని కొంతసేపు

నిదానించి 'అన్నా! మనకు తెలిసిన ఆడపిల్ల ఉంటే ఎంత బాగుండిపో ు అని ప్రతివాడూ అనుకోసాగాడు.

నేను చూస్తూ ఉండగా ఓ చిన్న కారు వచ్చి ఆగింది. ఆ కారులోంచి ముగ్గురు యువతులు చేతుల్లో సంచీల్తో దిగారు. వాళ్ళని లోనికి తీసుకు పోవడానికి ఓ వాలంటీరు వచ్చింది. నే నా అమ్మాయిని సమీపించి "ఫలాని దుర్గ అన్న ఆవిడకు కొంచెం కబురు చేస్తావా ?" అన్నా.

"ఎవరు ? దుర్గా...ఎట్లాగుంటుందో కొంచెం చెప్పండి' అన్నది వాలంటీరు.

అన్నా ! నా భార్యను నేను వర్ణించవలసిన పరిస్థితి ఏర్పడిందిగదా అనుకుని—

"పొట్టిగా—చామనచాయ రంగు. మొన్ననే కొత్తగా చేరింది" అన్నా.

"అబ్బే—అది కాదండీ. ఏ చీర కట్టుకుందో, ఎట్లా జడ వేసుకుందో కొంచెం గుర్తుచెబితే చాలు" ఆ వాలంటీరు తొందరపడుతూ—

"పోనీ, కళ్ళజోడుందా ఆమెకు ?" అన్నది.

"అయ్యో, హాండుబ్యాగు కూడా లేదే" అన్నాను చివరికి. ఆ కారు లోంచి దిగిన ముగ్గురు యువతులూ చుర చుర చూశారు నావంక.

ఆ వాలంటీరు "ఉండండి వస్తా"నని వాళ్ళని లోపలకు తీసుకెళ్ళింది.

ఇంతకీ కర్మం! నే నా రోజు దుర్గ ఏ చీర కట్టుకుందో, ఏ రవిక తొడిగిందో చూడనన్నా చూడలేదు ఇంతలో ఆ అమ్మాయి వచ్చి "ఏదుర్గ? ప్లీడరుగారమ్మాయి చేర్పించింది-ఆమేనా?" అని నన్ను మళ్ళీ అడిగింది.

"అవునవును."

నా ప్రాణం లేచివచ్చినట్లయింది యిట్లా అడిగేసరికి.

"ఆమెను మీరిప్పుడు కలుసుకోవటానికి వీల్లేదే."

"ఏమన్నా అంత నేను కలుసుకోవటానికి వీల్లేని పరిస్థితుల్లోవుందా?" అన్నా సందేహిస్తూ.

"అయ్యో! గ్రీన్‌రూములో వున్నారామె" అంది వాలంటీరు. అని కొంచెంసేపాగి-

"మీ కామెతో పనా?" అంది.

"అవును" అన్నా.

ఆ వాలంటీరు నవ్వి-"మీరు గ్రీన్‌రూములోకి వెళ్ళటానికి వీలులేదు. అక్కడ ఆడవాళ్లు వేషాలేసుకుంటున్నారు. ఐనా మీరు లోపలికి వచ్చి కూర్చోండి. నాటకం ఐపోగానే ఆమెతో మాట్లాడొచ్చు."

నేను ఆ వాలంటీరు వెనకాతలే వెళ్ళి స్టేజి కెదురుగ్గా వున్న కుర్చీలో కూర్చున్నాను. ఆ వాలంటీరు మళ్ళీ వచ్చి-'మీ పేరు?' అంది.

"ఇదేమిటి చెప్మా- వెళ్ళిపొమ్మనదు గదా" అనుకుంటూ చెప్పాను.

ఒక రసీదుపుస్తకంలో నా పేరు వ్రాస్తూ "మీరు విరాళమెంత వెయ్యదల్చుకున్నారో చెప్పండి దయచేసి" అంది వాలంటీరు. "అదికూడా నువ్వే వ్రాయి!" అన్నాను వొళ్ళుమండి.

ఆ వాలంటీరు నవ్వి-"నా అంతట నేను రాలేదు. దుర్గ వెళ్ళమన్నారు. ఆ తరువాత మీ యిష్టం" అంది.

"డబ్బు ఆవిడ యివ్వాలా? నేనే యివ్వాలా?"

"మీ పేరు మీదే వ్రాయమన్నారు చీటీ."

ఆ వాలంటీరు చేతిలో ఐదురూపాయ లుంచి రసీదు పుచ్చుకున్నాను.

నాకు దుర్గమీద చాలా కోపమొచ్చింది. నన్ను ఆహ్వానించి ఇక్కడకు వస్తే నా అతీ గతీ చూడలేదు. తీరా నా అంతట నేను లోపలకువచ్చి కూర్చుంటే తగుదునమ్మా అని ఐదురూపాయలు వదిల్చింది తను- యీ డబ్బు కరువుదినాల్లో.

తనేమో నాటకంలో వేషం వెయ్యటానికి వెళ్ళింది. ఎవర్నడిగింది?

ఈ లోపం వకటి దుర్గలో ఖణీగా కనుపిస్తూవుంది. తను చేసే ప్రతి పనికీ నా ఆమోదం వుండాలా, అక్కర్లేదా? మీటింగులకూ పుస్తకాలు చదువుకోడానికి వెళ్ళమన్నానుగాని నాటకాల్లో వేషా లెయ్యడానికీ, తన యిష్టమొచ్చినట్లు గెంతటానికి చేరమన్నానా స్త్రీసమాజంలో.

వాలంటీరుని పిలిచి దుర్గ నడిగి తాళాలు తెచ్చిపెట్టమని కోరాను.

వాలంటీరు తిరిగివచ్చి "మిమ్మల్ని వెళ్ళవద్దనంటున్నారు. ఇప్పుడే అరగంటలో కార్యక్రమం ప్రారంభమవుతుంది."

"తాళంచెవులమాటో...అన్నా"

"ఇవ్వలేదు" అని వాలంటీరు వెళ్ళిపోయింది.

నేను లేచి చరచరా నడిచి యివతల కొచ్చేస్తుండగా గేటుదగ్గర వాలంటీరు-

"వెళ్ళిపోతున్నారేం" అంది.

"విరాళ మివ్వడం అయిందిగా" అన్నా కోపంతో. ఆ వాలంటీరు వెంటనే లోపలకు పరుగెత్తింది. రసీదు నలిపి నేలకేసి కొట్టాను.

౩

తిన్నగా పార్కులోకి పోయి బల్లమీద కూర్చుని ఎప్పుడు మీటింగవుతుందా, ఎప్పుడు దుర్గ వస్తుందా అని నిముషాలు లెక్కపెట్టసాగాను. రేడియోనోరు పడిపోయినతరువాత ఆ పార్కులో యిక అట్టే సేపు కూర్చో బుద్ధివెయ్యలేదు.

ఎదురుగుండా వున్న హోటల్లోకి పోయి కాఫీ నోట్లో పోసుకుని సిగరెట్టు కాలుస్తూ పదకొండింటివరకూ గడిపాను.

ఈ లోగా నాకనేకమంది దేవుళ్ళు, కవులు, మహాభక్తులు, దేశనాయకులు కన్పించి "జాగ్రత్త! ఆడవాళ్ళను నమ్మకూడదు సుమా!" అని నన్ను హెచ్చరించినట్లయింది.

"అంగన నమ్మరాదు తన యంకకు రాని మహాబలాఢ్యు వే
భంగుల మాయలొడ్డి చెనపం దలపెట్టు వివేకియైన సా
రంగధరున్ పదంబులు కరంబులు గోయగజేసె తొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువరాని కుయుక్తులు పన్ని భాస్కరా!"

ఏమైనా, చెప్పటానికివీలులేనటువంటి కుయుక్తులో సుయుక్తులోపన్ని తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళనిపించుకోవటంలో ఆడవాళ్ళదే అగ్రతాంబూలం. ఎట్లాగైనా యిహనుంచి కొంచెం జాగ్రత్తగా వుండాలనీ, ఆడవాళ్ళమాట కాతరీ చేయకుండా వుండాలనీ తీర్మానించుకున్నాను. చివ

రకు యోగి అయ్యాడుగాని వేమన ఆడవాళ్ళతో ఎంత విసిగి పోకపోతే—"మాట వినని యాలు మగనికి మరగాలు" అని వాపోతాడా?

ఆకలి "రంయ్ రంయ్" మంటోంది కడుపులో. తరువాత, యిల్లాలు తాళం చెవులివ్వటానికి ఆగ్రహించి నిలువనీడలేకుండా చేసింది. మూడోది నిద్ర ముంచుకొస్తోంది. లేచి, చీకట్లో యింటిదారి పట్టాను. నేను వీధిమలుపులో కొచ్చేసరికి దుర్గ వక్కర్తి చరచర నడచి వెళ్తోంది. ఆవిడ దుర్గే! ఎందువల్లనంటే ఆ చీర నేను కొన్నది. ఆ కొనటంలో ఒక చిన్న రాద్ధాంతం జరిగింది.

పుట్టిన రోజుకి తనకు ఆనందకలరు కోయంబత్తూరుచీర కావాలంది.

"ఇంకా పుట్టినరోజేమిటి నీకూ-నాకూ-" అన్నా. ఎందువల్లనంటే అప్పుడు నెలాఖరు. డబ్బుకి అప్పుచెయ్యటం యిష్టంలేదు.

"ఏం? ఎందుకు చేసుకోకూడదూ?"

"బీదవాళ్ళకు పుట్టినరోజు లేమిటి ?"

చాలా ఆశ్చర్యపడి-"మనం బీదవాళ్లమా?" అంది.

"ఎందుకు కాము ? చక్రవర్తుల మనుకొంటున్నావా?"

"అట్లాగా-" అని వూరుకుంది. అప్పుడు నేనుకూడా నోరు మూసుకొని పడివుంటే సరిపోయేది. అట్లా వూరుకోక-ఒక చిన్న ఉపన్యాసాన్ని దంచాను.

గొంతు సవరించుకుని—"చూడు దుర్గా! ఇప్పుడు మనదేశంలో, అంటే యీ అఖండభారతావనిలో తిన తిండీ, కట్ట గుడ్డ, వుండ యిల్లులేక ప్రాణికోటి అల్లాడిపోతూవుంటే తుపానులు చెలరేగి పాడిపంటలు, పశువులు, దొడ్లు, యిళ్లు, వాకిళ్లు హారోహరి! రామార్పణమయిపోతూవుంటే యింకా పుట్టినరోజులనీ, కోయంబత్తూరు చీరలనీ వినోదాలకు విలాసాలకు కర్చుపెట్టమనటానికి నీకు నోరెలా వచ్చింది?"

దుర్గకు చాలా కోపము, రోషము వచ్చింది. ఐతే చేతగాని కోపం, రోషం క్రియగా మారటానికి బదులు స్త్రీలలో వుడుకుమోతుతనంగా మారటం జరుగుతుంది.

నేను మాట్లాడకుండా చూస్తూవూరుకున్నాను. ఆ మర్నాడు యికరేపు దుర్గ పుట్టినరోజనగా ఒక చిన్న పాతికరూపాయల మనియార్డరు హాతా

త్తుగా వచ్చిపడింది. ఇదివరకో స్నేహితుడు నా దగ్గర తీసుకున్న చేబదులు బాపతది.

ఇప్పుడు ఏ చీరైతే అలంకరించుకుని దుర్గ విసవిసా నడచిపోతోందో ఆ ఆనందకలరు కోయంబత్తూరుచీర నే నప్పుడా డబ్బుతో కొన్నాను.

నేను నడుస్తూ జోడుచప్పుడు చేశాను. దుర్గ నేను వెనకాల వస్తున్నానని తెలుసుకున్నదో లేదో గాని వెనక్కి తిరిగి చూడలేదు. నేను రెండు పెద్ద అంగలువేసి రెండుచేతులతో గట్టిగా వెనుకనుంచి పట్టుకుని వూపిరి సలపనివ్వకుండా—

"తాళంచెవు లెందు కిచ్చావు గాదు?"

దుర్గ తెలతెలబోతూ "అయ్యో! నేను నేను-మీ దుర్గను కాను" అని బలవంతంగా తోసింది. తోసి గబుక్కున పట్టువిడిపించుకుని దూరంగా నుంచుంది. నేను చాలా తెల్లబోయి సిగ్గుతో తల వంచుకున్నాను.

ఆ అమ్మాయి ప్లీడరుగారి ఇందిర. "పొరబాటు. మీరు కట్టుకున్న చీర దుర్గదికూడా వుంది. అందువలన ఆమె అనుకుని—" ఆమెముఖంకేసి చూశాను- ఏమన్నా అనుకుందేమో అని.

"నే నివ్వాళ కట్టుకున్నది మీ దుర్గచీరే."

గన్నేరుచెట్ల వెనుక దూరాన్న కొండమీద చందమామ చుక్కమ్మలతో సరాగా లాడుతున్నాడు.

"ఐతే దుర్గ మీతో రావటం లేదా?"

"ఊహు. ముందరే వెళ్ళిపోయింది."

తరువాత నేనేం అడగలేదు. ఇందిర గబగబ ఇంట్లోకి పారిపోయింది. నేను ఒంటరిగా రోడ్డుమీద పగలబడి నవ్వుకున్నాను.

ఎంత తమాషా జరిగింది. అచ్చంగా దుర్గే అనుకున్నాను సుమా! ఆ చీరే కట్టుకుంటే. తరువాత యీ సంగతి దుర్గతో చెప్పకుకదా ఆ పిల్ల అనిపించింది.

తప్పకుండా చెబుతుంది. ఎందుకల్లంటే వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులు. ప్రాణస్నేహితులమధ్య రహస్యాలు మడిగట్టుకూర్చోవు.

అసలు నేను స్త్రీ సమాజంనుంచి కోపంతో బయటికొచ్చెయ్యడం సంగతి కూడా ఇందిరకు తెలిసేవుంటుంది.

ఇప్పుడు నే నే ముందుగా దుర్గతో యీ సంగతి చెప్పివేస్తే—కాని అది లౌక్యమనిపించుకోదు. తనకు జడిసి చెప్పేస్తున్నా ననుకుంటుంది కొంపదీసి. అయినా రేపు యిందిర ఎట్లానూ దుర్గచీర దుర్గకివ్వటానికి వస్తుంది. అయినా వీళ్ళ కిదేం పొయ్యేకాలం? ఎవరిబట్టలు వాళ్లు కట్టుకోక—యీ మార్చుకోవటాలేమిటి?

ఇట్లా ఒక మాటుగాదు, లక్షమాట్లు జరిగితే గట్టిగా బుద్ధి వస్తుంది.

౬

“నాథుల్ నేరము ల్సేయ, పేరలుక జెందినయట్టి కాంత లుచిత వ్యాపారము ల్నేర్తురే?”

అన్నాడు ముక్కు తిమ్మన్నగారు.

నామమట్టుకు వళ్ళు మండుతూనే ఉంటుంది. కైక దశరథుణ్ణి నిరసించినప్పుడూ, సత్యభామ జలజాతాసనవాసవాది సురపూజాభాజనంబై తనర్చులతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునం దొలగం ద్రోసె అన్నప్పుడూ.

అయినా కృష్ణరాయలను—అంత మహాపురుషుణ్ణి దేవేరి చూసో చూడకో కాలితో తన్నిందయ్యా—అంతే. ఆయనగారి కోపం రావటం సహజం కాదూ? అంత మాత్రానికి ముక్కు తిమ్మన్నగారు పారిజాతపహరణం వ్రాసెయ్యాలా? వ్రాసి ఆడవాళ్ళకు కోపంవస్తే అవతలవాడు మగడయ్యేదీ, మరోడయ్యేదీ, ప్రహారణాలు తప్పవని నాజూగ్గా ‘ఉచిత వ్యాపారము ల్నేర్తురే?’ అని సమర్థించాలా?

ఆ ముక్క ఆధారం చేసుకుని ఎంతమంది కాంతలు ఎడా పెడా మొగుళ్ళను వాయించి, ఇదేమిటంటే ప్రతి ఆడదీ—

‘నాథు ల్నేరముల్సేయ-’ అంటూ చదవటమా? బాగు బాగు!

ఇట్లా ఆలోచిస్తూ పడుకున్నా. చాలా సేపటివరకూ నిద్ర పట్టలేదు. ఇందిర వచ్చి దుర్గతో చెప్పినట్లూ-'తాళం చెవుల మాట ఇంక ఎత్తరుగదా! ఎత్తనని వొట్టు పెయ్యండి!' అంటూ దుర్గ చెయ్యెత్తి మీది మీది కొస్తున్నట్లుగా ఫీలయ్యాను.

తెల్లవారి మెల్లగా ప్రక్క మీదకు పొడుచుకొస్తున్న సూర్యకాంతి చురచుర మనిపించేదాకా లేవలేదు. బద్ధకంగా ఇటూ అటూ దొర్లాను.

దుర్గ చెంబులూ తప్పాలాలూ చప్పుడు చేస్తోంది. పాలవాడు వచ్చి పాలు కలిపిన నీళ్లు పోసి పోవటం-దుర్గ డబ్బులో నీళ్లు కలిపి ఇవ్వటానికి వీల్లేదని విచారించటం అన్నీ వింటూనే వున్నా. ఆఖరికి బ్రహ్మంగారి శిష్యులు.

"చెప్పలేదం టనక పొయ్యేరు-

జనులార గురుని..."

అంటూ గుమ్మం ఎదుట గొంతు చించుకుని అరుస్తూండగా ఆవులించి వొళ్లు విరుచుకుని జేబులోంచి కానీ తీసి వాళ్ళ మొహాన పారెయ్యగా వాళ్లు మాయమయ్యారు.

మరో పావుగంటకల్లా ఉల్లిపాయ పెసరట్లు వాసన గుప్పుని కొట్టింది వంటింట్లోంచి. నేను లేవలేదు. సాధారణంగా నేను వంటింటిలో కూర్చుని పెసరట్లు వెయ్యటం, దుర్గ కాఫీ కలపటం అనాదిగా వస్తూండేటటువంటి ఆచారం.

ఈవాళ సనాతనత్వానికి కొంచెం అగౌరవం జరిగింది.

కాఫీ త్రాగకుండా సిగరెట్టు కూడా కాల్చను. అటువంటి నిష్ఠ నాది. ఇవాళ కాఫీ త్రాగకుండానే సిగరెట్టు ముట్టించి నిన్నటి పేపరు తిరగేస్తున్నా.

ఎందుకో బట్టల వంకీన అప్రయత్నంగా వ్రేలాడేసివున్న ఆనంద కలరు కోయంబత్తూరు చీరవంక చూడటం జరిగింది.

చూడగానే ఉలిక్కిపడ్డాను. నేను నిద్రనుంచి లేవకుండానే ఇందిర వచ్చి దుర్గతో మాట్లాడి వెళ్ళింది కాబోలు. కింకర్తవ్యతావిమూఢత్వ మావేశించి అట్లా ఉత్తర గోగ్రహణంలో తిక్కనగారు చెప్పినట్లు-

'వెలవెల బారుచు వెగడొందు బెదవుల
తడియార నెంతయు తల్లడిల్లు'
అన్నట్లుగా వుంది నా పరిస్థితి.

మానవులు కొన్ని పనులు పగలు, కొన్ని పనులు రాత్రిళ్ళు తప్ప చెయ్యరు. దొంగతనాలు, వ్యభిచారము, హత్యలు రాత్రిళ్లు జరిగినంత వీలుగా పగటిపూట జరుగవు. వెలుతురికెంత విలువో చీకటికీ అంతే విలువ. చీటికి మాటికి గిల్లికజ్జాలాడుకునే దంపతులు సైతం చీకటిపడగానే ఒకటైపోతారు ద్వేషాన్ని వైషమ్యాన్ని దిగమ్రింగి.

అట్లాగే చీకట్లో ఆలిమీద ఆగ్రహించినవాడి ఆగ్రహం ప్రణయానికి బారెడు మేరలో ఉంటుంది.

కాకపోతే ఇందిరను చూసి దుర్గ అనుకోవడమేమిటి? కోపావేశం వల్ల గాకపోతే – ఆనంద కలరు చీర వంకీన గాలికి రెపరెపలాడుతూ వయ్యారంగా ఎగుర్తోంది.

దుర్గ పెసరట్లు జతను నా బల్లమీద వుంచి వెళ్ళిపోబోయింది,

'కోపమా ?' అన్నా చెయ్యి పట్టుకుని. నన్ను విడిపించుకుంటూ—

'ఉండండి. మంచినీళ్లు తేవద్దూ ?' అని లోపలికి వెళ్ళిపోయింది.

ఈ లోగా మాడిన పుల్లిపాయ తొక్కలను ఏరుకుని నోటిలో పడవేసుకుంటూ—

'తెలిసే ఉంటుంది. తెలియకుండా ఎందుకుంటుంది ?' అని నాలో నేను గొణుక్కున్నా.

మంచినీళ్ళ గ్లాసు వచ్చి పెసరట్లు పక్కన నుంచుంది. ఈ మాటు దుర్గ అమృతహస్తాన్ని ముట్టుకోకుండా—

"రాత్రి నాటకం ఎలాగుంది ?" అన్నా.

"మీా రలిగి వెళ్ళిపోయారుగా !"

"వెళ్లటం తప్పా ?"

దుర్గ తలకాయ కిటికీవైపుకు తిప్పుకుని గాలితో మాటాడినట్లు—

"నలుగుర్లో నాకు చిన్నతనంకాలా ? మీారు చాలా మంచివారనీ, బాగా చదువుకున్నారనీ వాళ్లు అనుకుంటూ ఉండేవారు."

"వాళ్ళంటే...?"

"మా కార్యదర్శిని, ఇంకా నన్నెరిగిన కొందరు సభ్యులు."

"ఇప్పు డేమొచ్చింది ?"

"మీరు చాలా కోపిష్ఠి అని, నామీద అలగటంవలన తెల్లమైంది.'

"అయిదు రూపాయలు వదుల్చుకున్నా మీ స్త్రీ సమాజం నాకు వంక పెట్టుక తప్పింది కాదన్న మాట."

"ఆ విరాళ మివ్వమని నేను కబురంపలేదు. ఇందిర నా యెదుటనే ఇట్లా చెప్పి వసూలు చెయ్యమని పంపింది."

"ఎట్లా...ఆ పిల్ల కేమధికారం ?" అందుకనే తగిన శాస్తి జరిగింది రాత్రని మనస్సులో గుప్తంగా ఆనందించాను.

దుర్గ మాటాడకుండా కాఫీ తెచ్చి గ్లాసులోకి పోస్తూ—

"రాత్రి మీరు అన్నం తినలేదు. కోపమేగదూ ?"

నేను నవ్వాను. ఆ రోజుకి దుర్గ ఆనందకలరు చీరవిషయం ఎత్తలేదు. ఇందిర చెప్పిందా లేదా అన్న అనుమానం అలానే ఉండిపోయింది.

## ౭

మళ్ళీ ఒకరోజు ఆఫీసునుంచి వస్తూండగా ప్లీడరుగారమ్మాయీ, దుర్గా ఎక్కడ్నుంచో కబుర్లు చెప్పూకుంటూ వస్తున్నారు.

బహుశా ఏదో పేరంటమై యుంటుంది. ఆవాళ కూడా దుర్గ చీర ఇందిర కట్టుకుంది.

ఇంకోమాటు ఆడవాళ్లంతా సినిమాకు బయలుదేరారు. నేను హాల్లో దుర్గను కలుసుకున్నాను. అప్పుడు తెల్లపట్టుచీర కట్టుకుని మెళ్లో ఐదారు పేటల చంద్రహారపు గొలుసు వేసుకొని కులుకుతూవుండగా—కొంచెం విసుగ్గా.

"ఇవన్నీ ఎక్కడి"వన్నా.

"వాళ్ళ ఇందిరవే—నన్ను కట్టుకోమని బలవంతపెట్టి ప్రాణం తీసేసింది."

"హుఁ!" అని మూలిగాను. "ఏమిటి నష్టం మీకు?" అంది.

"చీకట్లో నిన్ను వాళ్ళు ఇందిర అని ఎవళ్ళయినా పొరపాటుపడితే..."

"ఛీ! పొండి—మీరు మరీనూ—" నా వాదాన్ని త్రోసివేసింది నవ్వుతూ. నేను డైలమాలో పడిపోయాను.

తరువాత నే ననేకమాట్లు ప్రయత్నించాను-ఒకళ్ళ బట్టలు ఒకళ్లు కట్టుకోవటం, ఒకళ్ళ నగలొకరు ధరించటం మానిపించాలని.

ఇందిర దుర్గతో ఆవాల్టి సంగతి గనుక చెప్పివున్నట్లయితే యింత గతజలసేతుబంధన మయేదికాదు.

నాకే వుపాయమూ తోచలేదు.

దుర్గ, ఇందిర యథాప్రకారంగా అన్యోన్యం ఒకళ్ళ వస్తువు లొకరు మార్చుకుంటూ తిరుగుతున్నారు. నేను ఆలోచించి ఒకరోజు సాయంత్రం పిలిచి చల్లగా చెప్పాను.

"దుర్గా! ఇల్లు మార్చేస్తున్నాను" అని.

"నేను యిక్కడి దక్కడ అక్కడి దిక్కడ సర్దలేను. ఐనా యిప్పుడేం వచ్చిందని? ఇదివరకంటే తగూలు తంపులు ఉన్నాయని! ఇప్పుడు ఇక్కడ అట్లాంటివేమీ లేవుగా."

"ఐనా మనం సామాన్యసంసారులం. ముప్పైరూపాయల అద్దె భరించగలమా? పద్దెనిమిది రూపాయల వాటా ఖాళీ అయింది."

దుర్గ మొత్తానికి అయిష్టంగానే వుంది—ప్లీడరుగారి, పోలీసువారి పొరుగు విడిచిపెట్టి వెళ్ళటానికి. మొత్తానికి పద్దెనిమిదిరూపాయల వాటాలో ప్రవేశించక తప్పిందికాదు. ★


కథాసాగరం

15

ఇచ్ఛాపురపు జగన్నాథరావు కథలు